క్లుప్తంగా

తీరంలో అప్రమత్తం



చింతపల్లి తీరంలో మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న అధికారులు

పూసపాటిరేగ: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం ఉన్నందున తీరంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎన్వీ రమణ తెలిపారు. ఈ మేరకు తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, పతివాడబర్రిపేట, తిప్పలవలస గ్రామాలలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ..24 గంటల పాటు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని సూచించారు. పడవలు, వలలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ సంజీవ్‌కుమార్ , మండల సర్వేయర్ గణపతిరావు, తదితరులున్నారు.

అవంతిలో దసరా సంబరాలు



అమ్మవారి వేషధారణల్లో విద్యార్థులు

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో దసరా సంబరాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. వివిధ విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు దేవీ నవరాత్రులను పురస్కరించుకుని దేవీ పూజను ఘనంగా నిర్వహించారు. దుర్గమ్మవారిని దేదీప్యమానంగా పూలమాలలతో అలంకరించి, భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. ఈ ఉత్సవాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సరీఫ్‌తో పాటు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పైడితల్లి జాతరకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: పైడితల్లి జాతరకు సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు టూటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్‌డ్ బలగాలను రంగంలోకి దించుతామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలైన వైఎస్సార్ నగర్, బాబామెట్ట, డబుల్ కాలనీ, కొండవెలగాడలో చెక్‌పోస్టులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు బాడీవార్న్‌లతో సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు.

మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలి

నెల్లిమర్ల రూరల్: మహిళల పట్ల ప్రతిఒక్కరూ మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్సై గణేష్ సూచించారు. మండలంలోని సారిపల్లి రామమందిరం వద్ద శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మహిళలు, బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. పోక్సో కేసు నమోదైతే జీవితాంతం జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైస్‌కార్డుల పంపిణీ పూర్తి చేయండి

భోగాపురం: మండలంలో స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని తహసీల్దార్ రమణమ్మ డీలర్లను ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో గల రేషన్‌షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు సక్రమంగా, పారదర్శకంగా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి అధికారి సుదర్శనరావు

నెల్లిమర్ల: ఉపాధి పనులకు సంబంధించి ఆదివారం నుంచి 19వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి సుదర్శనరావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు డీఆర్పీలు, ఆర్పీలు క్షేత్రస్థాయిలో ఆడిట్ చేస్తారని చెప్పారు. సమావేశంలో ఏపీఓ రామారావు, ఈసీ యుగేష్, తదితరులు పాల్గొన్నారు.

30లోగా పన్నులు చెల్లించాలి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భవన, తాగునీటి కుళాయిల పన్నుల మొత్తాన్ని ఈనెల 30లోగా వడ్డీ భారం లేకుండా చెల్లించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్థ సంవత్సరానికి సంబంధించి పన్నులు చెల్లించని యజమానులు తక్షణమే చెల్లించాలని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో పన్ను చెల్లించేందుకు వచ్చే వారి కోసం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎంతవరకు సురక్షితం..?



సరఫరా చేస్తున్న వాటర్ క్యాన్లు

- నగరంలో ఇష్టారాజ్యంగా వాటర్‌ప్లాంట్ల వ్యాపారం
- నిబంధనలకు చెల్లుచీటీ
- గుంటూరులో ఘటనతో అప్రమత్తమైన యంత్రాంగం
- వాటర్‌ప్లాంట్లలో తనిఖీలు చేపట్టనున్న అధికారులు

విజయనగరం: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనకు సోకే వ్యాధులు అధికంగా మనం తాగే నీటి ద్వారానే సంక్రమిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ విషయంలో అవగాహన లేమితో కొందరు, అన్నీ తెలిసి మరికొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వింత వింత వ్యాధులు ప్రబలుతున్నాయి. పుట్టగొడుగుల్లా ఆర్‌ఓ ప్లాంట్లు వెలుస్తున్నాయి. కనీసం వంద మందిలో ఒక్కరు కూడా లైసెన్స్‌లు తీసుకున్న దాఖలాలు లేవు. అలాగే తనిఖీలు చేయాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడం, కాసుల కోసం నిబంధనలు పాటించకుండా ప్లాంట్ల యజమానులు ఇష్టానురీతిగా వ్యవహరిస్తుండడంతో సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గుంటూరు నగరంలో వాటర్ ప్లాంట్ల నీరు తాగి ప్రజలు అతిసార బారిన పడడంతో మున్సిపల్ శాఖ అప్రమత్తమైంది. ప్రధాన నగరాల్లో వాటర్‌ప్లాంట్ల నిర్వహణ, అనుమతులపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశించింది. దీంతో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వాటర్‌ప్లాంట్ల తనిఖీలకు అధికారులు సిద్ధమయ్యారు.

స్వచ్ఛంద సేవ ముసుగులో..

ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసేటప్పుడు అసిస్టెంట్ ఫుడ్ సెఫ్టీ కంట్రోలింగ్ అధికారులతో పాటు కార్పొరేషన్ నుంచి లైసెన్స్‌లు తీసుకోవాలి. అధికారులు కూడా అన్నీ సరిగా ఉన్నాయో, లేవో చూసుకుని లైసెన్స్‌లు మంజూరు చేయాలి. అయితే చాలా మంది స్వచ్ఛంద సేవలో భాగంగా ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. వీరు ఎటువంటి లైసెన్స్‌లు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

నిబంధనలు పాటించేవారెందరు...?

విజయనగరంలోని వాటర్ ప్లాంట్ల నిర్వహణలో అనేక లోపాలున్నాయి. ఐఎస్ఐ స్టాండర్డ్ ప్లాంట్ ఏర్పాటుకు కనీసం రూ.20 లక్షలు ఖర్చయ్యే పరిస్థితి ఉండగా.. ఇక్కడ రూ.5 లక్షల్లోపే మొక్కుబడిగా పెట్టేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఫిల్టర్లు మార్చకపోవడం, కొన్ని ప్లాంట్లలో కార్పొరేషన్ నీటినే శుద్ధి చేయకుండా డబ్బాల్లో నింపి అమ్మేస్తుండడం..రివర్స్ ఆస్మాసిస్ ప్లాంట్ల నుంచి వచ్చే నీటిలో పీహెచ్ స్థాయి తక్కువగా ఉండడం.. నీటి డబ్బాలు సరిగా కడగకపోవడం.. నీటి నమూనాలను తరచూ పరీక్షించకపోవడం కారణంగా అనారోగ్యాలు ప్రబలే అవకాశం ఉంది.

మినరల్ నీరు అనుకుంటే పొరపాటే..

ఆర్‌ఓ ప్లాంట్లలో అమ్మేది మినరల్ నీరు అని అపోహ పడుతుంటారు. సాధారణంగా నీళ్లలో సోడియం సల్ఫేట్, కాల్షియం కార్బొనేట్, పొటాషియం, మెగ్నీషియం సల్ఫేట్ లాంటి కొన్ని ఖనిజాలను అదనంగా కలిపితే మినరల్ నీరు అంటారు. కానీ ఇవి కేవలం కొన్ని కార్పొరేట్ కంపెనీలు మాత్రమే పాటిస్తాయి. వీధుల్లో ఉండే ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వాహకులు చేయలేరు. ప్రభుత్వం సరఫరా చేసే నీరు సక్రమంగా ఉంటే ఆర్‌ఓ పద్ధతి అవసరం ఉండదంటున్నారు నిపుణులు. కార్పొరేషన్ నీటిని కాచి చల్లార్చి వడపోసుకుని తాగడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు.

జాడే లేని స్టీల్ ట్యాంకులు

వాస్తవానికి ఆర్‌ఓ ప్లాంట్‌లలో స్టీల్ ట్యాంకులనే వాడాలి. కానీ ఎవరూ స్టీల్ ట్యాంక్‌లను వినియోగించడం లేదు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ ట్యాంక్‌లే దర్శనమిస్తున్నాయి. ప్రతి 15 రోజులకోసారి ట్యాంక్‌ను శుభ్రపరిచి, ఆ తేదీని ట్యాంక్‌పై రాయాలి. అలాగే ప్లాంట్‌కు సమీపంలో మురుగునీటి కాలువలు ఉండకూడదు. 20 లీటర్ల వాటర్ క్యాన్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. ప్రతి ఆరు నెలలకోసారి క్యాన్లు మార్చాలి. కానీ ప్లాంట్ యజమానులు ఎక్కడా అలా చేయడం లేదు.

తనిఖీలకు సహకరించాలి..

నగర పరిధిలో ఉన్న వాటర్ ప్లాంట్లను తనిఖీ చేస్తాం. రాష్ట్రంలో ఇటీవల విస్తరించిన డయేరియా కేసులను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు సురక్షితమైన నీటిని అందించే ప్రయత్నంలో భాగంగా ఈ తనిఖీలు చేపడుతున్నాం. పరిశీలన బృందానికి ప్లాంట్ నిర్వాహకులు సహకరించాలి. నీటి నమూనా పరీక్షలకు అవసరమైన రుసుమును నిర్వాహకులే చెల్లించాలి.

– పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

భవనాలను వినియోగంలోకి తీసుకువస్తాం

పూసపాటిరేగ: చింతపల్లి బీచ్‌లో పర్యాటక భవనాలు పునర్నిర్మాణ పనులు సాగుతున్నాయని జిల్లా టూరిజం అధికారి కె. కుమార్ అన్నారు. 'చింతపల్లిలో పడకేసిన పర్యాటకం' శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అక్టోబర్ నెలాఖరు నాటికి టూరిజం భవనాలు పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. భవనాల పునర్నిర్మాణానికి రూ. 1.5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆరు గదులు సామర్థ్యంతో మూడు కాటేజీలు, ఒక రెస్టారెంట్, సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

మిమ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల: ఉద్యోగులను వేధిస్తున్న మిమ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు టీవీ రమణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మిమ్స్ యాజమాన్యం కావాలనే ఉద్యోగులను దూరప్రాంతాలకు బదిలీ చేస్తోందని ఆరోపించారు. దీనిలో భాగంగానే కొండగుంపాం గ్రామానికి చెందిన యడ్ల గౌరీని విజయనగరం అర్బన్ మిమ్స్ సెంటర్ నుంచి బొబ్బిలి బదిలీ చేయడంతో.. ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. గతంలో కూడా ఓ డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించడంతో ఆయన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు.

సత్య డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తొలిత కళాశాల సెక్రటరీ, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ఎస్ రాజు, కల్నల్ గోపేంద్ర, ఎం.శశిభూషణరావు, ఎంవీ సాయిదేవమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పైడితల్లి ఉత్సవాలు

- ఆర్డీఓ దాట్ల కీర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కీర్తి

విజయనగరం క్రైమ్: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి అన్నారు. తన చాంబర్‌లో ఉత్సవ సమన్వయ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. వాతావరణ పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. గుడి లోపల తోపులాటలు జరిగే అవకాశం ఉన్నందున క్యూలైన్లలో దర్శనాలు జరిగేలా చూడాలన్నారు. వీఐపీ దర్శనాలను ఒక్క నిమిషంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో పాత భవనాల యజమానులకు నోటీసులు జారీ చేసి, ఆ భవనాలపై మనుషులు లేకుండా చూడాలని తెలిపారు. అత్యవసర వైద్య వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డీఎస్పీ ఆర్. గోవిందరావు, తహసీల్దార్ కూర్మనాథ్ , డీసీహెచ్ఎస్. పద్మశ్రీ రాణి,పోలీస్, దేవస్థానం సిబ్బంది, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దీక్షలకు ఏర్పాట్లు



దీక్షల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి, తదితరులు

విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పూల్‌బాగ్‌లోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో దీక్షలకు సంబంధించి కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అక్టోబరు 22 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు స్వామి దీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ అధ్యక్షుడు బేతా కృష్ణారావు, కార్యదర్శి ఇసరపు శ్రీనివాస గోపాలకృష్ణ, కోశాధికారి వారణాశి సతీష్, వైస్ ప్రెసిడెంట్ బెహరా కూర్మారావు, దువ్వు శ్రీనివాసరావు, చిలకలపూడి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ పండగే..

- పైడితల్లికి ఘటాలతో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు
- శరవేగంగా సిరిమాను, ఇరుసుమాను పనులు
- జాతర ఏర్పాట్లపై అధికారుల సమీక్షలు
- అమ్మవారి సిరిమాను జాతర చాటింపు నేడు



సిరిమాను తయారీ పనులను పర్యవేక్షిస్తున్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు

విజయనగరం టౌన్: అంబరాన్నంటే సిరిమాను సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను శరవేగంగా నిర్వహిస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకునేందుకు వందలాది మంది భక్తులు బారులు తీరుతున్నారు. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడితో పాటు రైల్వేస్టేషన్ వద్దనున్న అమ్మవారి వనంగుడికి భక్తుల సంఖ్య రోజురోజుకూ పోటెత్తుతోంది. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కనులారా వీక్షించి పసుపు, కుంకుమలు, చీరె, సారె, ఘటాలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. అక్టోబర్ 6న తొలేళ్ల ఉత్సవం, 7న నిర్వహించే సిరిమాను సంబరాలకు ఓ వైపు సిరిమాను, ఇరుసుమానుల తయారీ ప్రక్రియ, మరో వైపు ఆలయం వద్ద చలువ పందిళ్లు, భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా క్యూలైన్స్ ఏర్పాట్లు శరవేగంగా చేపడుతున్నారు. జాతర ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు.

పైడితల్లి ఆభరణాలకు మెరుగులు

పైడితల్లి అమ్మవారి ఆలయానికి సంబంధించిన వెండి ఆభరణాలు, తలుపులు, పంచహారతుల సామాన్లకు పట్టణానికి చెందిన అమ్మవారి స్తపన బృందం స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. బాలాజీ గోల్డ్ వర్క్స్ సంస్థకు చెందిన వర్కర్స్, కుటుంబీకులు సంయుక్తంగా 15 ఏళ్లుగా ఈ సేవలందిస్తున్నారు.



పైడితల్లి అమ్మవారు

శరవేగంగా సిరిమాను, ఇరుసుమాను పనులు

గంట్యాడ మండలం కొండతామరాపల్లి గ్రామం నుంచి సిరిమాను, ఇరుసుమానులను ఈ నెల 24వ తేదీ రాత్రి విజయనగరం హుకుంపేటలో ఉన్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు ఇంటి వద్దకు తీసుకువచ్చారు. నాటి నుంచి వందలాది మంది భక్తులు సిరిమానుకు పూజలు, చల్లదనం చేస్తున్నారు. మరోపక్క వడ్రంగులు చింతమానును సిరిమానుగా మలిచే ప్రక్రియను ప్రారంభించారు.

అమ్మవారి సిరిమాను చాటింపు నేడు..

పైడితల్లి సిరిమాను ఉత్సవ చాటింపు ప్రక్రియను ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీషా శనివారం తెలిపారు. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం మనవి చెప్పే కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఆలయ తలయారులు, పూజారులతో ఆలయ ఆవరణలో చాటింపు ప్రక్రియను రామవరపు చిన పైడిరాజు బృందం నిర్వహిస్తారని తెలిపారు.

విక్రయదారులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

నెల్లిమర్ల: ఆవు మాంసం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె. సత్యనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ శ్రీకాంత్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. విజయనగరం కంటోన్మెంట్ నుంచి ఆవు మాంసం తీసుకొచ్చి మండలంలోని పలు గ్రామాల్లో విక్రయిస్తున్నారన్నారు. సారిపల్లి గ్రామం నుంచి పశువులను అక్రమంగా తరలిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువులను తరలిస్తున్న వారితో పాటు వాటిని వధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు బి. సంధ్యారాణి, రేణుక, రమణమ్మ పాల్గొన్నారు.

పొటాష్ లోప నివారణకు జిల్లేడు ద్రావణం

డెంకాడ: వరి పంటలో పొటాష్ లోప నివారణకు జిల్లేడు ద్రావణం ఎంతో ఉపకరిస్తుందని ప్రకృతి వ్యవసాయం ఆర్టీఎల్ హేమసుందర్ అన్నారు. మండలంలోని సింగవరం గ్రామ పరిధిలో ఉన్న కొత్తచెరువు వద్ద పొటాస్ లోపంతో ఉన్న వరి పంటకు జిల్లేడు ద్రావణాన్ని శనివారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లేడు ద్రావణంతో అనేక ప్రయోజనాలున్నాయని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఈశ్వరమ్మ, సుజాత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీలో మార్పులతో వినియోగదారులకు లాభం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులను మార్చడం వల్ల వినియోగదారులకు లాభం చేకూరుతుందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రిసోర్స్‌పర్సన్లు, వీఆర్‌ఓలు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరిట ఈనెల 25 నుంచి అక్టోబర్ 19 వరకు నెల రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా జీఎస్టీ తగ్గడం ద్వారా కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గతంలో 28%, 18%, 12% ఉన్న జీఎస్టీ శ్లాబులు ఇప్పుడు 5% లేదా 0%కి తగ్గిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సుమారు 923 వస్తువులపై ఐదు శాతం లేదా జీరో శాతం జీఎస్టీ మాత్రమే ఉందని తెలిపారు. సమావేశంలో టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్..

- గొర్లిపేట వద్ద గుంతలు పూడ్చడంతో ప్రశంసలు



గొర్లిపేట బ్రిడ్జి వద్ద భారీ గుంతలను కప్పిస్తున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారి అత్యంత దయనీయంగా మారింది. పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు పడుతున్నప్పుడు గుంతల్లో నీరు చేరడంతో ఎక్కడ ఏ గుమ్ము ఉందో తెలియక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాలకులు పట్టించుకోవాలని మొత్తుకుంటున్నా వినేవారే లేకపోవడంతో చివరికి పోలీసులే స్పందించాల్సి వచ్చింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో గొర్లిపేట వద్ద ఏర్పడిన భారీ గుంతలకు తాత్కాలికంగా మోక్షం కల్పించారు. స్థానిక యువత సహకారంతో ఎస్సై గణేష్ తారు, క్రషర్‌తో శనివారం గుంతలను పూడ్చారు. రహదారిపైకి పొలాల్లో ఉన్న నీరు రాకుండా చర్యలు చేపట్టారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

- కమిషనర్ నల్లనయ్య



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పైడితల్లి జాతర నేపథ్యంలో నిర్దేశించిన పనులన్నీ నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం నగరంలోని పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. రామారాయుడు రోడ్డు ప్రాంతంలో పర్యటించి పెద్ద చెరువు చుట్టూ చేపడుతున్న సుందరీకరణ పనులను పర్యవేక్షించారు. ప్రధాన జంక్షన్ల వద్ద చేపట్టబోయే విద్యుదీకరణ, ఇతర అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. డివైడర్లకు రంగులు అద్దే కార్యక్రమం ఎంతవరకు వచ్చిందని ఆరా తీసారు. పాక్షిక మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని స్పష్టం చేశారు. పర్యటనలో ఈఈ ప్రసాద్, డీఈలు శ్రీనివాసరావు, రత్నాకర్, ఏఈలు సుధాకర్, సూరినాయుడు, పారిశుధ్య పర్యవేక్షకుడు సాలెం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై దుర్గాదేవి ఆశీస్సులు

- చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మజ్జి సిరిసహస్ర

విజయనగరం: దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర ఆకాంక్షించారు. నగరంలోని అశోక్‌నగర్‌లో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గాదేవికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆమెను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, భక్తులు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ



లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దుర్గాదేవి



ఉయ్యాల కామేశ్వరి అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



పసుపు కొమ్ముల అలంకరణలో కాత్యాయనీదేవిగా దర్శనమిస్తున్న దుర్గాదేవి

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో కొలువైన దుర్గాదేవి శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితుడు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయికిరణ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అదేవిధంగా సిటీబస్టాండ్ వద్దనున్న కనక మహాలక్ష్మి అమ్మవారు ఉయ్యాల కామేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు వీకే గాయత్రీశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గాజులరేగలోని కొలువైన దుర్గాదేవి కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి పసుపు కొమ్ములతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

దళిత యువకులపై దాడి అమానుషం



మాట్లాడుతున్న జై భీమ్‌రావ్ భారత్ పార్టీ నాయకులు

నెల్లిమర్ల రూరల్: దేశంలో, రాష్ట్రంలో ఏదో చోట దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య, ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సతివాడలో శనివారం వారు మాట్లాడుతూ.. బాపట్ల జిల్లా మాటూరులో దళిత యువకులైన ప్రమోద్, జ్యోతిలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పోలీసులు దాడి చేయడం అమానుషమన్నారు. దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్, కుమార్‌రాజు పాల్గొన్నారు.